


TGTEL/25/A31

# నేటి దిక్సూచి

తెలుగు దిన పత్రిక




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :162 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ గురువారం- 09 - జూలై- 2026

## కారుణ్య మరణాలకు మార్గం సుగమం - సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు




సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్గదర్శకాల రూపకల్పన

వెంటిలేటర్‌పై అవసాన దశలో ఉన్న రోగులకు ఊరట

మార్గదర్శకాలకు ఆమోదం తెలిపిన మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి : తీవ్రమైన వ్యాధులతో బాధపడుతూ, ప్రాణాపాయ స్థితిలో నరకయాతన అనుభవించే రోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. ఇకపై వారికి 'కారుణ్య మరణం' ప్రసాదించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలను రూపొందించింది. కళ్లెదుటే నరకయాతన : కొందరు రోగులు తీవ్రమైన వ్యాధుల బారిన పడతారు. వైద్య చికిత్సలకు ఏమాత్రం లొంగని స్థితికి చేరుకుంటారు. తిరిగి కోలుకునే అవకాశం అస్సలు ఉండదు. కేవలం వెంటిలేటర్ సహాయంతోనే కృత్రిమంగా ఊపిరి పీల్చుకుంటారు. మిగతా..2లో

## తెలంగాణ వరి కొనుగోళ్ల పెంపుపై ఢిల్లీలో కీలక భేటీ!



కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమై రాష్ట్ర రైతాంగ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించింది.

తెలంగాణ రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

హైదరాబాద్: తెలంగాణలో రబీ సీజన్ (యాసంగి) 2025-26 కు సంబంధించి వరి, బియ్యం అదనపు కొనుగోళ్లపై ఢిల్లీలో ఒక ముఖ్యమైన ఉన్నత స్థాయి భేటీ జరిగింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం.. కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమై రాష్ట్ర రైతాంగ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించింది. మిగతా..2లో

## నాకు మంత్రి పదవి ఇవ్వండి.. నీళ్లు తెచ్చి చూపిస్తా: హరీశ్




- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్
- మూడు నెలలు మంత్రి పదవి ఇస్తే కాళేశ్వరం నీళ్లు తెస్తానన్న హరీశ్
- విఫలమైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటన
- తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ అవినీతికి పాల్పడిందని ఆరోపణ

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. తనకు మూడు నెలల పాటు నీటిపారుదల శాఖ బాధ్యతలు అప్పగిస్తే, కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను

## తెలంగాణపై ప్రేమ ఉంటే గోదావరి బెల్ట్ కోల్‌బ్లాక్‌లు

# సింగరేణికి కేటాయించాలి

- తాడిచెర్ల-2 బొగ్గు గనులను వేలం లేకుండానే సింగరేణి సంస్థకు కేటాయించిన కేంద్రం
- అనుమతి ఇవ్వడం సంతోషకరమని వెల్లడించిన ఉపముఖ్యమంత్రి
- గోదావరి బెల్ట్ కోల్ బ్లాక్‌లను వేలం లేకుండా సింగరేణికి ఇవ్వాలని విజ్ఞప్తి




హైదరాబాద్: సింగరేణికి తాడిచర్ల-2 కేటాయింపు సంతోషకరమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వాస్తవాలను మరుగునపరిచి తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. 2013లో సింగరేణికి కేంద్ర ప్రభుత్వం లేఖ రాసిందని గుర్తు చేశారు. యూపీఏ హయాంలోనే తాడిచర్ల-2ను సింగరేణికి కేంద్రం కేటాయించిందని వెల్లడించారు. తాడిచెర్ల-2 బొగ్గు గనులను వేలం లేకుండానే సింగరేణి సంస్థకు కేటాయించినట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో భట్టి విక్రమార్క ఈ విధంగా వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు పెండింగ్ లోనే : గిరిజన ప్రాంతాల్లోని బొగ్గును ప్రభుత్వ సంస్థలు తప్ప మరొకరు చేయకూడదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

## తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి.. సీఎం రేవంత్‌తో హైకమిషనర్ భేటీ



- కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు.
- ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు.

హైదరాబాద్, జులై 8 : కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (బుధవారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం కెనడాలో పర్యటించాలని ప్రతినిధులు ఆహ్వానం పలికారు. తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు సీఎం ఆహ్వానం పలికారు. తెలంగాణలో పెట్టుబడులు పెంచేందుకు కెనడా ప్రతినిధులు ఆసక్తి చూపించారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై కెనడా ప్రతినిధులతో సీఎం కీలక చర్చలు జరిపారు. హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో మిగతా..2లో

## మమతకు బిగ్ షాక్.. రూ. 440కోట్ల డిపాజిట్లు ఫ్రీజ్ !




- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఒక భారీ సైబర్ ఫ్రాడ్
- కేంద్ర దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగడంతో బెంగాల్ రాజకీయాల్లో ఒక్కసారిగా తీవ్ర కలకలం రేగింది.

ఢిల్లీ : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (ువీజ) అధినేత్రి మమతా బెనర్జీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ) ఊహించని భారీ షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఆ పార్టీకి చెందిన రూ. 440 కోట్ల భారీ డిపాజిట్లను ఈడీ అధికారులు అటాచ్ (ఫ్రీజ్) చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఒక భారీ సైబర్ ఫ్రాడ్ (సైబర్ నేరం)

## ఇరాన్‌తో కాల్పుల విరమణ

# ముగిసింది..

- అమెరికా తరపు సంప్రదింపుల ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ చర్చలు జరపాలని
- ఇరాన్‌లో ఆందోళనలు చేస్తున్న 54 వేల మంది నిరసనకారులను అక్కడి ప్రభుత్వం కాల్చి చంపిందని,




ఇరాన్‌తో కుదిరిన జెనరిక్ కాల్పుల విరమణ ఒప్పందం ఇకపై అమల్లో ఉండదని, తన దృష్టిలో అది ముగిసిపోయినట్లేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. అంకారాలో జరిగిన నాటో సదస్సులో మాట్లాడిన ఆయన, ఇరాన్ పాలకులను అత్యంత కఠినమైన పదజాలంతో దూషించారు. ఇరాన్ నేతలు అబద్ధాలకోరులని, మానసిక రోగులని, ఘోరమైన హింసావాదులని మండిపడ్డారు. వారి వద్ద గనుక అణుఆయుధాలు ఉంటే ఖచ్చితంగా వాడేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా తరపు సంప్రదింపుల ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ చర్చలు జరపాలని భావిస్తున్నప్పటికీ, ఇరాన్‌తో మాట్లాడటం కేవలం సమయం వృథా అని ట్రంప్ స్పష్టం చేశారు.

## VB G RAM G' అంటే ఉపాధి హక్కులను దొంగలించడమే'

# కొత్త చట్టంపై కాంగ్రెస్ విమర్శలు

- వీబీ జీ రామ్ జీ పథకాన్ని 'రోజ్ గార్ అధికార్ చోరీ'గా అభివర్ణించిన కాంగ్రెస్
- ఎంజీ నరేగా స్థానంలో కేంద్రం బలవంతంగా ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందని ఆరోపణ- పర్యావరణ మంత్రిత్వ శాఖపై విమర్శ



ఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ 'వీబీ జీ రామ్ జీ' పథకంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ కొత్త చట్టాన్ని రోజ్ గార్ అధికార్ చోరీ(ఉపాధి హక్కుల దొంగతనం)గా అభివర్ణించారు. గ్రామీణ ప్రాంతాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' (ఎంజీ నరేగా) స్థానంలో కేంద్ర ప్రభుత్వం బలవంతంగా ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ కొత్త చట్టాన్ని విమర్శిస్తూ, జమ్ముకశ్మీర్ మాజీ ఆర్థిక మంత్రి హసీబ్ ద్రాబు రాసిన

## హిందుత్వ మూలాలను దెబ్బతీసేలా జగన్ వ్యాఖ్యలు




- సానుకూల వాతావరణం ఉన్నప్పుడు లబ్ధి పొందాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు.
- కులమత విద్వేషాలు పెంచేలా చేస్తున్నారని మండిపడ్డారు.

విజయవాడ, జులై 8: సానుకూల వాతావరణం ఉన్నప్పుడు లబ్ధి పొందాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. కులమత విద్వేషాలు పెంచేలా చేస్తున్నారని మండిపడ్డారు. (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. చట్ట పరిధిలో మత విద్వేషాలు రేకెత్తిస్తున్న వారిపై చర్యలు తప్పవన్నారు.

## విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు

# హాస్టళ్లు, గురుకులాల మెస్ ఛార్జీల పెంపు

- ప్రస్తుతం ఇస్తున్న మెస్ ఛార్జీలను 10 శాతం పెంచుతూ సీఎం నిర్ణయం
- ఎంజేపీ పాఠశాలల శాశ్వత భవనాలకు రూ.500 కోట్లు మంజూరుకు ఆమోదం
- సంక్షేమ శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష




అమరావతి : బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు చెల్లించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఇస్తున్న డైట్ ఛార్జీల్లో 10 శాతం పెంచాలని ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సంక్షేమ శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సందర్భంగా విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, వచ్చే ఏడాది నుంచి పెంచుదామని ఆర్థిక శాఖ అధికారులు సూచించినా, ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే డైట్ ఛార్జీల పెంపు వర్తింపజేయాలని సీఎం స్పష్టం చేశారు. బలహీనవర్గాల విద్యార్థుల కోసం డైట్ ఛార్జీలు పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జీవితాల్లో విద్య ద్వారానే మార్పు వస్తుందని తెలిపారు. దీనికి తగినట్టుగానే వారికి అన్ని రకాల అవకాశాలు కల్పించాలన్నారు. మెరుగైన విద్య, మౌలిక సదుపాయాలతో పాటు పౌష్టికాహారాన్ని అందించాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు డైట్ ఛార్జీలు పెంచుతున్నామని వెల్లడించారు.

## ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు.. హ్యోసంగ్‌కు లోకేశ్ కీలక ప్రతిపాదనలు

- బుసాన్‌లో హ్యోసంగ్ ప్రతినిధులతో లోకేశ్ భేటీ
- కుప్పంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ క్లస్టర్ ప్రతిపాదన
- ఏపీలో ఆర్అండ్‌డీ, ఇన్నోవేషన్ సెంటర్ కోరిన మంత్రి
- దక్షిణ భారత తయారీ క్లస్టర్‌పై ప్రత్యేక ప్రతిపాదన
- కుప్పంలో రూ.900 కోట్ల ప్లాంట్‌ను గుర్తు చేసిన హ్యోసంగ్
- ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కంపెనీ హామీ



అమరావతి : దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్.. ప్రముఖ హ్యోసంగ్ గ్రూప్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో బుసాన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఫుట్‌వేర్ తయారీ రంగాన్ని మరింత విస్తరించేలా పలు కీలక ప్రతిపాదనలు చేశారు. కుప్పంలో హ్యోసంగ్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినందుకు కంపెనీ ప్రతినిధులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. అదే ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపొనెంట్, మెటీరియల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో దిగుమతులపై ఆధారపడటం తగ్గడంతో పాటు ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయని వివరించారు. ప్రీమియం బ్రాండ్ల కోసం పెర్ఫార్మెన్స్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత కస్టమైజేషన్, సస్టెయినబుల్ మెటీరియల్స్‌పై పరిశోధనలు జరిగే నెక్స్ట్ జనరేషన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్ ఆర్అండ్‌డీ, ఆసియా-పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్‌ను కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు మిగతా..2లో

## మొదటి పేజి తరువాయి

### ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు..
# హ్యోసంగ్‌కు లోకేశ్ కీలక ప్రతిపాదనలు

సేవలందించేలా సమగ్ర దక్షిణ భారత తయారీ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. ఇందులో కుప్పంలో ప్రధాన కార్యాలయం, తిరుపతిలో విడిభాగాల తయారీ కేంద్రం, విశాఖపట్నంలో డిజైన్, కార్పొరేట్, లాజిస్టిక్స్ విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే హ్యోసంగ్ ఫుట్‌వేర్‌కు చెందిన టైర్–1, టైర్–2 విక్రేతలతో ఏపీలో సప్లయర్ సమావేశం నిర్వహించాలని కోరారు. సమావేశంలో హ్యోసంగ్ కార్పొరేషన్ బిజినెస్ సీఈవో హెయో సియోంగ్–రియోంగ్ స్పందించారు. కుప్పంలో రూ.900 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ నాన్–లెదర్ ఫుట్‌వేర్ ప్లాంట్‌ను ఇప్పటికే ప్రకటించినట్లు తెలిపారు. అడిడాస్‌తో పాటు పలు అంతర్జాతీయ బ్రాండ్లకు ఓఈఎం సరఫరాదారుగా ఉన్న ఈ ప్లాంట్‌లో ఏడాదికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూలను తయారు చేయనున్నట్లు చెప్పారు. మొదట ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని ఉత్పత్తి ప్రారంభిస్తామని, తర్వాత దేశీయ మార్కెట్‌కు కూడా విస్తరిస్తామని వెల్లడించారు. పుణే, చెన్నై, అనంతపురం జిల్లా గూడపల్లిలో ఆటో విడిభాగాల తయారీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

# హిందుత్వ మూలాలను దెబ్బతీసేలా జగన్ వ్యాఖ్యలు

పక్క రాష్ట్రాల నుంచి వీడియో మెసేజ్‌లు పంపుతూ విద్వేషాలు రేకెత్తిస్తున్నారని ఆరోపించారు. హిందుత్వ మూలాలు దెబ్బతీసేలా కుట్రపూరితంగా జగన్ మాట్లాడారంటూ విరుచుకుపడ్డారు. విద్వేషాలకు ఊతమిచ్చేలా నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలున్నాయన్నారు. జగన్ హయాంలో మూడు ప్రాంతాలనూ అభివృద్ధి చేయలేదని మంత్రి విమర్శించారు. మావిగన్ అనే అసంబద్ధమైన వాదన తీసుకొచ్చారన్నారు. పొంతన లేకుండా మాట్లాడుతున్న మాటలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక ఆలోచనలు జరుగుతున్నాయని.. స్థానిక ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధిపై ముందుకెళతామని చెప్పారు. త్వరలోనే స్థానిక ఎన్నికల్లో ఎవరు.. ఎక్కడ పోటీ చేయాలనే దానిపై పార్టీ అధినాయకత్వాలు నిర్ణయిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

### తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి..
# సీఎం రేవంత్‌తో హైకమిషనర్ భేటీ

కెనడా సహకారం కోరారు సీఎం. హైదరాబాద్‌లో కెనడా యూనివర్సిటీల మల్టీ–క్యాంపస్ ఏర్పాటు ప్రతిపాదన చేశారు. ఐటీ, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్‌లో తెలంగాణ పురోగతిని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణపై కెనడా కంపెనీల విశ్వాసం పెరుగుతోందని సీఎం రేవంత్, క్రిస్ కూటర్ తెలిపారు. ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణను హైకమిషనర్ ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, డిఫెన్స్ రంగాల్లో కెనడా ట్రేడ్ డెలిగేషన్ త్వరలో తెలంగాణకు రానుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

### సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అంతర్జాతీయ ప్రతినిధులు

సీఎం రేవంత్‌రెడ్డిని అంతర్జాతీయ ప్రతినిధులు కలిశారు. నిలి గిల్బర్ట్ బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ బోర్డు సలహాదారు, మహేశ్ కొండూరు అమెరికా ప్రభుత్వ సలహాదారు మొమెంటం టెక్నాలజీస్ సీఈఓ, అమిత్ మెహ్రా ఆక్సన్ టెక్నాలజీస్ సీఈఓ, దిలెక్ , నార్వే మాజీ స్టేట్ సెక్రటరీ, థామస్ ఫ్రోలిక్, దక్షిణాఫ్రికా పార్లమెంట్ సభ్యుడు, సెంథిల్ తొండమాన్, సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ (జఔజ) అధ్యక్షుడు( శ్రీలంక) సీఎంని కలిసిన వారిలో ఉన్నారు.

# మమతకు బిగ్ షాక్.. రూ. 440కోట్ల డిపాజిట్లు ఫ్రీజ్ !

ద్వారా వచ్చిన అక్రమ సొమ్ము, వివిధ మార్గాల ద్వారా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధికారిక బ్యాంక్ ఖాతాల్లోకి చేరినట్లు వచ్చిన తీవ్రమైన ఫిర్యాదుల ఆధారంగా ఈడీ ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ నిధుల మూలాలను, వాటి వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగడంతో బెంగాల్ రాజకీయాల్లో ఒక్కసారిగా తీవ్ర కలకలం రేగింది.

### ఏవియేషన్ సేవలపై ఈడీ నిఘా.. విచారణ ముమ్మరం!

ఈ వ్యవహారంలో ప్రధానంగా ఏవియేషన్ (విమానయాన) రంగానికి సంబంధించిన లావాదేవీలపై ఈడీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ వివిధ విమానయాన సంస్థలకు, సంబంధిత సర్వీస్ కంపెనీలకు ఏకంగా రూ. 160 కోట్లకు పైగా నిధులను చెల్లించినట్లు ప్రాథమిక విచారణలో ఆధారాలు లభ్యమయ్యాయి. అయితే, ఎన్నికల ప్రచారం లేదా ఇతర పార్టీ కార్యక్రమాల నిమిత్తం విమాన సేవలను ఉపయోగించుకునే పేరుతో, సైబర్ నేరాల ద్వారా వచ్చిన నల్లధనాన్ని వైట్‌మనీగా మార్చేందుకు ఏమైనా ప్రయత్నించారా? లేదా ఈ నిధులను దుర్వినియోగం చేశారా? అనే కోణంలో ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది. రాబోయే రోజుల్లో ఈ అకౌంట్ల నిర్వహణకు బాధ్యులైన పార్టీ ముఖ్య నేతలకు కూడా నోటీసులు ఇచ్చి విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# తెలంగాణ వరి కొనుగోళ్ల పెంపుపై ఢిల్లీలో కీలక భేటీ!

ఈ కీలక భేటీలో తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు పలువురు సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు. ఈ చర్చల్లో భాగంగా యాసంగి సీజన్‌లో తెలంగాణలో రాబోయే రికార్డు స్థాయి వరి దిగుబడిని దృష్టిలో ఉంచుకుని, ఎఫ్‌సీఐ ద్వారా సేకరించే బియ్యం కోటాను గణనీయంగా పెంచాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. గత సీజన్లకు సంబంధించిన బకాయిల క్లియరెన్స్, రైస్ మిల్లుల కేటాయింపులు, మరియు గోదాముల్లో నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే కనీస మద్దతు ధర నేరుగా రైతుల ఖాతాల్లోకి చేరేలా చూడాలని చర్చించారు. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పండిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

### దిల్లీలో పెట్రోల్ బాంబు దాడులకు ఐఎస్ ఐ కుట్ర
# రైల్వే స్టేషన్ , బస్ స్టాప్ , పోలీస్ లైన్సే టార్గెట్
### పాక్ కు చెందిన ఐఎస్ ఐ హ్యాండ్లర్ ఆదేశాలతో దిల్లీలో పెట్రోల్ బాంబు దాడులకు కుట్ర
### న్యూ పోలీస్ లైన్స్ , ఆనంద్ విహార్ ఐఎస్ బీటీ, రైల్వే స్టేషన్లే లక్ష్యం

ఢిలి : దిల్లీ పోలీసులు భారీ ఉగ్రకుట్రను భగ్నం చేశారు. పాకిస్థాన్ ఐఎస్ ఐ హ్యాండ్లర్ షెహజాద్ భట్టీ పర్యవేక్షణలో దిల్లీపై పెట్రోల్ బాంబు దాడులకు కుట్ర పన్నినట్లు వారు గుర్తించారు. బుధవారం దిల్లీ, పంజాబ్ ల్లో ఆరుగురు అనుమానిత వ్యక్తులను దిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ అరెస్టు చేసింది. వారిని తమదైన రీతిలో విచారణ చేయగా, ఈ కుట్ర గురించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. “పాకిస్థాన్ కు చెందిన ఐఎస్ ఐ హ్యాండ్లర్ షెహజాద్ భట్టీ ఆదేశాల మేరకు దేశ రాజధాని దిల్లీలోని పలు కీలక ప్రాంతాల్లో పెట్రోల్ బాంబు దాడులు చేయడానికి ఉగ్రవాదులు కుట్ర పన్నారు. ముఖ్యంగా దిల్లీలోని సివిల్ లైన్స్ ప్రాంతంలో ఉన్న న్యూ పోలీస్ లైన్స్ , ఆనంద్ విహార్ ఇంటర్ –స్టేట్ బస్ టెర్మినల్ , రైల్వే స్టేషన్ సహా విపరీతమైన రద్దీ ఉండే మార్కెట్ ప్రాంతాల్లో వారు రెక్కీ నిర్వహించి, దాడులు చేయడానికి ప్లాన్ చేశారు“ అని పోలీసులు తెలిపారు.

### నిషేధిత యాప్స్ ద్వారా చాటింగ్

దర్యాప్తు సమయంలో నిందితుల మొబైల్ ఫోన్ల నుంచి ఈ ప్రాంతాలకు సంబంధించిన వీడియోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తాము రికార్డు చేసిన రెక్కీ వీడియోలను ఒక నిషేధిత మెసేజింగ్ అప్లికేషన్ ద్వారా ఐఎస్ఐ హ్యాండ్లర్ భట్టీకి పంపినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. భట్టీకి, నిందితులకు మధ్య జరిగిన సోషల్ మీడియా చాట్ లను కూడా రీస్టోర్ చేశారు. ఆ చాట్ లో ఏముంది? జూన్ చివరి వారంలో భట్టీ, నిందితుడు డానిష్ (అలియాస్ చంద్ మియాన్) మధ్య జరిగిన సంభాషణలు దర్యాప్తులో బయటపడ్డాయి. ఆ చాట్ లో ‘మెటీరియల్ ‘ సాయంత్రంలోపు అందుతుందని, దానిని సేకరించాలని భట్టీ, డానిష్ కు తెలిపాడు. ఆ తర్వాత మెటీరియల్ అందిందా అని భట్టీ అడగగా, అంతా సేకరించామని డానిష్ సమాధానం చెప్పాడు. ఆ వస్తువులను సురక్షితంగా సిద్ధంగా ఉంచుకొని, తదుపరి ఆదేశాల కోసం వేచి ఉండాలని భట్టీ ఆదేశించాడు. కాగా ఈ చాట్ లో ప్రస్తావించిన ‘మెటీరియల్ ‘ దిల్లీలో పెట్రోల్ బాంబు దాడులకు చేయడానికి ఉద్దేశించిందేనని దర్యాప్తులో తేలింది. అంతకు ముందు పోలీసులు రాజ్ ఘాట్ వెనుక ఉన్న విజయ్ ఘాట్ నుంచి పెట్రోల్ బాంబులను స్వాధీనం చేసుకున్నారు.

పాక్ నెట్ వర్క్ తో సంబంధాలు

ఇంతకు ముందు అరెస్టు చేసిన ఆరుగురు నిందితులకు, షెహజాద్ భట్టీ కోసం పనిచేస్తున్న మరో 10 మంది పాకిస్థాన్ వ్యక్తులతో కూడా పరిచయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఉగ్రకుట్రలో వారి పాత్ర, ప్రమేయంపై దర్యాప్తు అధికారులు విచారణ జరుపుతున్నారు.

ఎవరికి ఏ పని అప్పగించారంటే,

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, డానిష్ (అలియాస్ చంద్ మియాన్)కు దిల్లీలో రెక్కీ నిర్వహించడం, దాడికి ప్రణాళిక వేసే బాధ్యతను భట్టీ అప్పగించాడు. ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేస్తే డానిష్ కు రూ.20వేలు ఇస్తానని మాటిచ్చాడు. సల్మాన్ అనే మరో నిందితుడికి ఒక ప్రత్యేకమైన పని అప్పగించారు. ఇతను డానిష్ కు సహకరిస్తూ, ఉగ్ర దాడులకు సంబంధించిన వీడియో తీసి, ఆ ఫుటేజ్ ని నేరుగా షెహజాద్ భట్టీకి పంపాలని చెప్పారు. దిల్లీలోని షాహీన్ బాగ్ కు చెందిన తయ్యబ్ , ఐఎస్ ఐ పంపిన ఆయుధాలు అందుకోవడం, వాటిని అమ్మే పనులను చూసుకుంటున్నాడు. ఘజియాబాద్ లోని మోదీనగర్ కు చెందిన జుబేర్ ఖాన్ అమృత్ సర్ నుంచి ఆయుధాల కన్సైన్ మెంట్ ను తీసుకువచ్చాడు. మేరఠ్ కు చెందిన అలీ ఫజల్ ఆయుధాలను విక్రయించే బాధ్యత చూసుకున్నాడు. అమృత్ సర్ కు చెందిన మల్కిత్ సింగ్ ఈ నెట్ వర్క్ లో కీలక వ్యక్తి. ఇతను పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా పడేసిన ఆయుధాలను సేకరించి, వాటిని తమ ఉగ్ర నెట్ వర్క్ లోని మిగిలిన సభ్యులకు పంపిణీ చేసే బాధ్యత తీసుకున్నాడు. అయితే ఐఎస్ ఐ హ్యాండ్లర్ షెహజాద్ భట్టీతో సంబంధం ఉన్న రెండు మాడ్యూళ్లను ఛేదించిన తర్వాత,

# విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు - హాస్టళ్లు, గురుకులాల మెస్ ఛార్జీల పెంపు

## మొదటి పేజి తరువాయి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు లబ్ది చేకూర్చే విషయంలో వారికి కలిగే ప్రయోజనాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సీఎం అన్నారు. సంక్షేమ శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని స్పష్టం చేశారు. అందులోభాగంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున గురుకులాల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని వ్యాఖ్యానించారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ చేసేలా చర్యలు : హాస్టళ్ల స్థానంలో గురుకులాల నిర్మాణం చేపట్టేందుకు పెద్దపీట వేయాలని సీఎం ఆదేశించారు. రెసిడెన్షియల్ స్కూళ్లల్లో నెట్‌జీరో విధానాన్ని అమలు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో విశ్లేషించాలన్నారు. బయో డైవర్సిటీ పార్కుల తరహాలో గురుకులాలను నిర్వహించాలని సూచించారు. మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలతో గురుకులాలను నిర్మిద్దామన్నారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల మెయింట్ నెన్స్ గ్రాంట్ ఇవ్వాలని స్పష్టం చేశారు. దీని నిమిత్తం రూ.100 కోట్లు కేటాయిస్తున్నామని వెల్లడించారు. హాస్టళ్లు, గురుకులాల్లో చదివే విద్యార్థులను ఉన్నత విద్య, పోటీ పరీక్షలకు ప్రిపేర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇప్పించాలని తెలిపారు. పోటీ పరీక్షలకు గురుకులాల్లో చదువుతోన్న విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. విద్యతో సమానంగా శిక్షణ అందించాలని తెలిపారు. బెస్ట్ టీచర్స్ నియమించి క్వాలిటీ ట్రైనింగివ్వాలని ఆదేశించారు. హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకుంటూ ప్రతిభ కనబరిచే ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ప్రారంభించాలని అన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను మ్యాపింగ్ చేసి నైపుణ్యం పెంచి పారిశ్రామిక అవసరాలకు వర్క్‌ఫోర్స్ సిద్ధం చేయాలన్నారు. హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా ఓ వైద్య విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లను ఎన్ఆర్ఐలు అడాప్ట్ చేసుకునేలా వారితో సంప్రదింపులు జరపాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల నెట్ వర్కింగ్ చేయాలని తెలిపారు. రెసిడెన్షిల్ స్కూళ్లు, గురుకులాల్లో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యా, వైద్య సేవలు అందించే వాళ్లకి అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. పీ4 ద్వారా ఆర్థిక సాయం : పేదలు, బలహీన వర్గాలకు సంక్షేమం అందించడమే కాదు, వారి జీవనోపాధిని మెరుగు పరిచి మరింత ఆదాయాలు సమకూర్చేందుకు అన్ని మార్గాలను అన్వేషించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వం వైపు నుంచి అందించే సంక్షేమం, మెప్మా, డ్వాక్రా పథకాల ద్వారా ఉపాధి కల్పించడంతోపాటు, పీ4 ద్వారా సాయం అందాలని తెలిపారు. వ్యవసాయం, ఉద్యానరంగం, పాడి పరిశ్రమ, జీ రామ్ జీ సహా వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మేలు చేకూర్చాలన్నారు. సాస్కీ, పూర్వోదయ, జీ రామ్ జీ వంటి పథకాల లబ్ది బడుగు వర్గాలకు దక్కేలా చూడాలని ఆదేశించారు. ఉద్యాన, రబ్బర్, కాఫీ, పసుపు వంటి పంటల సాగును ప్రోత్సహించి ఆ వర్గాల రైతులకు లబ్ధి కలిగేలా చూడాలని అన్నారు. ఇప్పటికే కొన్ని విధానాల ద్వారా వారి జీవన స్థితిగతులను మెరుగు పరిచేలా పాలసీలు తీసుకున్నట్లు వివరించారు. లిక్కర్ షాపుల్లో కల్లుగీత వృత్తిదారులకు, క్వారీల్లో వడ్డెర్లకు కోటా పెట్టామని వెల్లడించారు. నాయీ బ్రాహ్మణులు, మత్స్యకారులు, చేనేత కార్మికులకు ఇలా వివిధ వర్గాలకు ఆర్థికంగా సాయం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పరంగా అందించే సాయమే కాకుండా వారి అభివృద్ధికి ఏమేం చర్యలు తీసుకోవానే అంశంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలనీ తెలిపారు. ఈ మేరకు వివిధ కుల కార్పొరేషన్ల బై లాస్ మార్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. రోజుకు 4 నిమిషాలు తల్లిదండ్రులతో : బ్రాహ్మణ కార్పొరేషన్ విధానాలను మిగిలిన కార్పొరేషన్లు కూడా అవలంబించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీ రామ్ జీ ద్వారా అంగన్వాడీ భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సందర్భంగా సంక్షేమ శాఖల్లో తాము తీసుకున్న చర్యలను మంత్రులు, అధికారులు వివరించారు. కొందరు విద్యార్థులు హోం సిక్‌కు గురవుతున్నారని అలాంటి విద్యార్థుల కోసం తల్లిదండ్రులతో మాట్లాడేలా స్మార్ట్ కార్డ్ బేస్డ్ టెలిఫోన్ వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. తల్లిదండ్రులతో రోజులో 4 నిమిషాలు మాట్లాడుకునే సదుపాయం కల్పించామని తెలిపారు. సాస్కి కింద సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో రూ.120 కోట్లతో ఆర్వో ప్లాంట్లు, టాయిలెట్స్ సహా ఇతర మౌలిక వసతులను కల్పించే పనులు చేపట్టామని అధికారులు వివరించారు. ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు పూర్తి చేశామని ఈ నెలాఖరు నాటికి టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. సమీక్షలో మంత్రులు డీబీవీ స్వామి, సవిత, సంధ్యారాణి, ఎన్ఎండీ ఫరూక్, మైనార్టీ సంక్షేమ సలహాదారు

# కారుణ్య మరణాలకు మార్గం సుగమం - సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

## మొదటి పేజి తరువాయి

మరణానికి చేరువై, ఆస్పత్రి పడకలపై వారు పడే నరకయాతన వర్ణనాతీతం. ఇలాంటి వారికి తాజా నిర్ణయం ఎంతో ఊరటనివ్వనుంది. వ్యాధి నుంచి కోలుకునే అవకాశం లేక చికిత్స పేరిట నానా ఇబ్బందులు పడేవారికి ఇది విముక్తిని ప్రసాదించనుంది. గతంలో చట్టపరమైన చిక్కులు : గతంలో కారుణ్య మరణానికి సంబంధించి స్పష్టమైన చట్టాలు లేవు. అవసాన దశలో ఉన్న రోగులకు లైఫ్ సపోర్ట్ సిస్టంను తొలగించేందుకు నిబంధనలు ఉండేవి కావు. దీంతో ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రోగుల కుటుంబ సభ్యులకు కూడా పలు న్యాయపరమైన సమస్యలు వచ్చేవి. చికిత్స నిష్ప్రయోజనం అని తెలిసినా చేసేది ఏమీ ఉండేది కాదు. రోగులు కృత్రిమంగా ఊపిరి పీల్చుకుంటూ తీవ్ర కష్టనష్టాలకు గురయ్యేవారు. సుప్రీం తీర్పు, మంత్రి ఆమోదం : అవసాన దశలో ఉన్న రోగులకు సహజరీతిలో కారుణ్య మరణం పొందే అవకాశాన్ని కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం పక్కా మార్గదర్శకాలను సిద్ధం చేసింది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో దీనిపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఈ మార్గదర్శకాలకు ఆయన ఆమోదం తెలిపారు. కుటుంబ సభ్యులకు రక్షణ కవచం : కొత్త మార్గదర్శకాలతో అందరికీ మేలు జరగనుంది. రోగుల స్వయం నిర్ణయాధికారాన్ని ఈ నిబంధనలు గౌరవిస్తాయి. ప్రాణాపాయ స్థితిలో చికిత్సను అందించే వైద్యులకు చట్టపరమైన రక్షణ లభిస్తుంది. అలాగే కారుణ్య మరణానికి సంబంధించి కఠిన నిర్ణయాలు తీసుకునే రోగుల కుటుంబ సభ్యులకు కూడా ఇబ్బందులు తప్పుతాయి. వారికి న్యాయపరమైన రక్షణ కవచంలా ఈ మార్గదర్శకాలు ఉపయోగపడతాయి. అవకతవకలకు తావులేకుండా చర్యలు : కారుణ్య మరణం ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది. దీనికోసం ప్రత్యేకంగా ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారు. జిల్లా స్థాయిలో డీఎంహెచ్‌వోలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యులను చేసింది. వీరు మార్గదర్శకాల అమలును నిశితంగా పరిశీలిస్తారు.

# తెలంగాణపై ప్రేమ ఉంటే గోదావరి బెల్ట్ కోల్‌బ్లాక్‌లు సింగరేణికి కేటాయించాలి

## మొదటి పేజి తరువాయి



సింగరేణి అవసరాల దృష్ట్యా కేంద్రానికి లేఖ రాస్తే కేంద్రం కేటాయించిందని చెప్పుకొచ్చారు. గతంలోనే కేటాయిస్తే 2013 నుంచి ఇప్పటివరకు పెండింగ్ లో పెట్టారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బ్లాక్ కేటాయింపు జరిగిందని అయితే మైనింగ్ లీజు కోసం అనుమతి ఇవ్వలేదని తెలిపారు. కొత్త చట్టం ప్రకారం తాడిచర్ల–2 సింగరేణికి ఇవ్వబోమని ఆయన అన్నారు. యాక్టు రావడానికి ముందే సింగరేణికి తాడిచర్ల–2 కేటాయించారని తెలిపారు. ప్రధానిని, కేంద్రమంత్రులను కలిసి వాస్తవాలను వారి ముందుంచామన్నారు. మైనింగ్ లీజు పెండింగ్ పెట్టడం వల్ల సింగరేణికి నష్టమని వివరించామని చెప్పారు. గోదావరి బెల్ట్ కోల్ బ్లాక్‌లను వేలం లేకుండా సింగరేణికి ఇవ్వాలని కిషన్‌రెడ్డిని కోరామన్నారు. వేలం లేకుండా ఇస్తే కొత్త బ్లాక్‌లు కేటాయించినట్లు అవుతుందని తెలిపారు. బ్లాక్–3లో మైనింగ్ చేయడానికి వీలులేదు : 2022లో గిరిజన ప్రాంతంలో వేలం వేసి ప్రైవేటుకు అప్పగించారని ప్రస్తావించారు. గిరిజన ప్రాంతంలో మైనింగ్ ప్రక్రియను గిరిజనులు లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే చేయాలనేది చట్టమని గుర్తు చేశారు. 2022లో కోయగూడెం బ్లాక్–3 వేలం వేసి ప్రైవేటు సంస్థకు అప్పగించారని అన్నారు. నాటి నుంచి బ్లాక్–3లో మైనింగ్ చేయడానికి వీలులేదన్నారు. ఈ నేపథ్యంలో ఇది పెండింగ్‌లో ఉందన్నారు. వేల కోట్లు నష్టం వచ్చింది : సింగరేణికి తాడిచర్ల–2 అప్పగించకపోవడం వల్ల వేల కోట్లు నష్టం వచ్చిందని భట్టి విక్రమార్క అన్నారు. సీఎం ఒత్తిడికి స్పందించి మైనింగ్ అనుమతి ఇవ్వడం సంతోషకరమని చెప్పారు. మైనింగ్ అనుమతించారు అయితే కోల్‌బ్లాక్ కేటాయించామనడం సరికాదని ఆయన అన్నారు. తెలంగాణపై ప్రేమ ఉంటే గోదావరి బెల్ట్ కోల్‌బ్లాక్‌లు సింగరేణికి కేటాయించాలని కోరారు. ఇలా చేయడం ఇదే తొలసారి : తాడిచెర్ల–2 బొగ్గు గనులను వేలం లేకుండానే సింగరేణి సంస్థకు కేటాయిస్తున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్మిక సంఘాలు అలాగే సింగరేణి యాజమాన్యం నుంచి విజ్ఞప్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పలుమార్లు చర్చించినట్లు వివరించారు. చివరగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. 2020 తర్వాత ప్రభుత్వ రంగ సంస్థకు వేలం లేకుండా బొగ్గు గనులను కేటాయించడం ఇదే తొలిసారని ఆయన తెలిపారు. సమగ్ర న్యాయపరమైన సలహాలు తీసుకున్న తర్వాతే తాడిచెర్ల–2 గనుల ఫైల్ పై సంతకం చేసినట్లు ఆయన వివరించారు. అప్పట్లో ఎలాంటి స్పందనా రాలేదు : గతంలో ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ ఉన్న సమయంలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులు తాడిచెర్ల–2 గనులను సింగరేణికి కేటాయించాలని కేంద్రానికి లేఖలు రాశారు. అయినా అప్పట్లో కేంద్రం నుంచి ఎలాంటి స్పందనా రాలేదు, ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కానీ నేడు తమ ప్రభుత్వం ఆ పనిని పూర్తి చేసిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణిలో ఉత్పత్తి తగ్గుతోందని ప్రస్తావించారు. ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పట్టాయన్నారు. వీటితో పాటు అప్పుల భారం కూడా పెరుగుతోందని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో వేలం ద్వారా కాకుండా నామినేషన్ పద్ధతిలో తాడిచెర్ల–2 బొగ్గు గనులను కేటాయించడం సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. “కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి నా విజ్ఞప్తి. గోదావరి పరిసర ప్రాంతంలోని కోల్ బ్లాక్ లన్నింటినీ వేలం లేకుండా సింగరేణికి కేటాయించాలి. తెలంగాణపై మీకు ఏమాత్రం ప్రేమ, అభిమానమున్నా దీనిని చేసిపెట్టాలి“

# నాకు మంత్రి పదవి ఇవ్వండి.. నీళ్లు తెచ్చి చూపిస్తా: హరీశ్

## మొదటి పేజి తరువాయి



ఆన్ చేసి ఎల్లంపల్లికి నీటిని తరలిస్తానని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఈ ప్రక్రియలో విఫలమైతే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన ప్రకటన చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అనుమతినిచ్చిందని, ఆ ఒప్పంద పత్రాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తాను చెబుతున్న విషయాలు అబద్ధమని తేలితే తన పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నదుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ జలాశయాలను నింపడం లేదని, దేవాదుల పంపులను నడపడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో 90 శాతం చెరువులు ఎండిపోవడం ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. నిపుణుల సలహాలు, కేంద్ర ప్రభుత్వ అనుమతులతోనే తాము కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హరీశ్ రావు సమర్థించుకున్నారు. తమ ప్రభుత్వంపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని, దీనికి కేసీఆర్, హరీశ్ రావులే బాధ్యులని జ్యుడీషియల్ కమిషన్ నివేదిక ఇవ్వడం, అలాగే సీబీఐ విచారణకు డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో హరీశ్ రావు ఈ విధంగా ఎదురుదాడికి దిగారు.

ఇరాన్‌తో కాల్పుల విరమణ ముగిసింది..

ఇరాన్‌లో ఆందోళనలు చేస్తున్న 54 వేల మంది నిరసనకారులను అక్కడి ప్రభుత్వం కాల్చి చంపిందని, ఈ దారుణాన్ని అంతర్జాతీయ మీడియా నివేదించలేదని ఆయన ఆరోపించారు. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై ఇరాన్ ఇటీవల దాడులకు తెగబడటంతో, అమెరికా సైన్యం దానికి దీటుగా ఎదురుదాడి చేసింది. ఇరాన్‌లోని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, కమాండ్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్లు, యాంటీ–షిప్ క్షిపణి కేంద్రాలతో పాటు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కి చెందిన 60కి పైగా చిన్న బోట్లను లక్ష్యంగా చేసుకుని అమెరికా సెంట్రల్ కమాండ్ 80కి పైగా సైనిక స్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. మార్షల్ ఐలాండ్స్, సౌదీ అరేబియా, లైబీరియా దేశాలకు చెందిన వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేయడం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని అమెరికా సైన్యం స్పష్టం చేసింది. ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ దుశ్చర్యలను అడ్డుకునేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని జజుచీజూవీ హెచ్చరించింది. అమెరికా వైమానిక దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే ట్రంప్ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# VB G RAM G అంటే ఉపాధి హక్కులను దొంగలించడమే‘- కొత్త చట్టంపై కాంగ్రెస్ విమర్శలు

## మొదటి పేజి తరువాయి



ఇది హక్కుల, డిమాండ్ ఆధారిత పథకం. ఇది కుటుంబాలకు 100 రోజుల పాటు నైపుణ్యం అవసరం లేని పనిని పొందే చట్టపరమైన హక్కును కల్పించింది“ అని హసీబ్ ద్రాబు ఒక ఆంగ్ల దినపత్రికలోని తన వ్యాసంలో తెలిపారు. గతంలో ఉన్న ఉపాధి హామీ చట్టం గ్రామీణ ప్రజలకు రాజ్యాంగబద్ధమైన పని హక్కును కల్పించి, గ్రామ పంచాయతీలకు అధికారాలను ఇచ్చేదని, కానీ, ప్రస్తుత కొత్త విధానం వల్ల అన్ని అధికారాలు కేంద్రం చేతుల్లోకి వెళ్తాయని జైరాం రమేశ్ ఆరోపించారు. ఈ కొత్త పథకం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై భరించలేనంత ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఎంజీ నరేగా లాగా ఏడాది పొడవునా అమలులో ఉండదని రమేశ్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, గత బుధవారం వీబీ జీ రామ్ జీ చట్టం అమల్లోకి వచ్చింది. అయితే, కొత్త చట్టం కింద వేతనాలు తక్కువగా ఉన్నాయని పేర్కొంటూ, గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దు చేసి, ఎంజీనరేగాను తిరిగి తీసుకురావాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

‘పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రవచన మంత్రిత్వ శాఖగా మారింది‘

మరోవైపు, కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు అత్యంత సన్నిహితులైన నలుగురిని రెండు రోజుల్లోనే తొలగించడంతో, ఆ శాఖలో పాలన కుప్పకూలిందని జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పర్యావరణాన్ని, అడవులను పరిరక్షించడానికి మంత్రిత్వ శాఖ పెద్దగా ఏమీ చేయలేదని, ‘పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రవచన మంత్రిత్వ శాఖగా మారిందని‘ ఆయన విమర్శించారు. గ్రేట్ నికోబార్, మధ్య, తూర్పు భారతదేశంలోని దట్టమైన అటవీ ప్రాంతాలు, ఆరావళి పర్వత శ్రేణి, ఇతర జీవవైవిధ్య పర్యావరణ వ్యవస్థలతో సహా దేశవ్యాప్తంగా పర్యావరణ విధ్వంసం నిరంతరాయంగా కొనసాగుతోందని తెలిపారు. “వాయు కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూనే ఉంది. అమలు చేయాల్సిన ప్రమాణాలు మాత్రం అస్సలు అమలు కావడం లేదు. ఈ జాబితాకు అంతులేదు. కానీ మోదీ ప్రభుత్వానికి కసం పట్టా ఉందా? పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రవచన మంత్రిత్వ శాఖగా మారింది“ అని కాంగ్రెస్ నేత ఆరోపించారు. మంత్రి భూపేందర్ యాదవ్‌కు కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. ఆయన నలుగురు ప్రైవేటు కార్యదర్శులపై వేటు వేస్తూ అసాధారణ నిర్ణయం తీసుకుంది. ఉద్వాసనలపై ఈ నెల 3వ తేదీనే నాలుగు వేర్వేరు ఉత్తర్వులిచ్చినా మంగళవారమే అవి వెలుగుచూశాయి. అయితే వాటిలో కారణాలను వెల్లడించలేదు. తొలగించిన వారిలో యాదవ్ ప్రైవేటు కార్యదర్శి, సహాయ ప్రైవేటు కార్యదర్శి, ఇద్దరు అదనపు ప్రైవేటు కార్యదర్శులున్నారు. 2010 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అధికారి భూపేందర్ యాదవ్, సహాయ ప్రైవేటు కార్యదర్శిగా ఉన్న సిద్ధార్థ్ యాదవ్, అదనపు ప్రైవేటు కార్యదర్శులు ఆయుష్ శరణ్, శైలేశ్ కుమార్ సింగ్‌లకూ ఉద్వాసన పలికారు.

# శ్రీ సత్యసాయి జిల్లాలో మొబైల్ హెచ్ఐవీ పరీక్షా కేంద్రం ప్రారంభం



పుట్టపర్తి: మారుమూల ప్రాంతాల ప్రజలకు హెచ్ఐవీ పరీక్షలు, అవగాహన సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి శ్రీ సత్యసాయి జిల్లాలో మొబైల్ హెచ్ఐవీ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రులకు చేరుకోలేని సుదూర ప్రాంతాల ప్రజలకు గ్రామాల వద్దకే వెళ్లి ఉచిత హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. హెచ్ఐవీ సంక్రమణ ప్రమాదం ఎక్కువగా ఉన్న వర్గాలు, వివిధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ప్రత్యేక వైద్య సేవలు, పరీక్షలు అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే హెచ్ఐవీ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. ఫైరోజా బేగం, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డా. అనుపమ జేమ్స్, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటరత్నం, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై నల్లమాడలో అవగాహన కార్యక్రమం



నల్లమాడ : మహిళలు, బాలల భద్రతపై నల్లమాడలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాల నిర్మూలన, శక్తి యాప్ వినియోగం, పోక్సో చట్టం తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, నేరాలు లేదా అనుమానాస్పద ఘటనలు జరిగినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని, మహిళలు, బాలల రక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొని పోలీసుల సూచనలు స్వీకరించారు.

## రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బలిజలకు కేటాయించాలి - కాపునాడు జిల్లా అధ్యక్షుడు



పుట్టపర్తి : గవర్నర్ కోటాలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక స్థానాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన బలిజ సామాజిక వర్గానికి కేటాయించాలని కాపునాడు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఇటికింటి మహేష్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలో బలిజ సామాజిక వర్గం విశేషంగా కృషి చేసిందని తెలిపారు. బలిజల అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బలిజలకు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ వంటి కీలక ప్రజాప్రతినిధ్య పదవులు ఇప్పటివరకు తగిన స్థాయిలో దక్కలేదని, ఈ నేపథ్యంలో శ్రీ సత్యసాయి, ఉమ్మడి అనంతపురం జిల్లాలకు చెందిన బలిజ నాయకులకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరారు. అలాగే కాపు కార్పొరేషన్ నిధులను వెంటనే విడుదల చేయాలని, తెలుగు జాతి వైభవానికి ప్రతీక అయిన శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లను కలిసి వినతిపత్రం అందజేస్తామని ఇటికింటి మహేష్ తెలిపారు.

## అసత్య ఆరోపణలతో రాజకీయాలు చేయడం మానుకోవాలి - టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి




పుట్టపర్తి : నిరాధార ఆరోపణలతో రాజకీయ ప్రచారం చేయడం సరికాదని శ్రీ సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి హనుమప్ప అన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా వ్యక్తిగత ఆరోపణలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరిపైనైనా ఆరోపణలు చేస్తే వాటిని చట్టబద్ధమైన ఆధారాలతో నిరూపించాలని, లేకపోతే ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, అయితే వ్యక్తిగత స్థాయికి దిగజారి మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. టీడీపీ నాయకులు అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సేవనే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. అసత్య ప్రచారాలు, దుష్ప్రచారాలను ప్రజల సహకారంతో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి అంబులెన్స్ రమేష్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ శ్రీనివాసులు, పుట్టపర్తి పట్టణ కన్వీనర్ బోయ రామాంజనేయులు, తెలుగు యువత నాయకులు వైవీ మురళీ చౌదరి, పెనుగొండ శ్రీనివాసులు, పల్లవరాజు, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణాపురంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




బుక్కపట్నం : బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో బుధవారం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా కార్యదర్శి కటారి గంగాధర్ మాట్లాడుతూ, తిరుపతిలోని పద్మావతి ఆసుపత్రి నిపుణుల వైద్య బృందం ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 125 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన 20 మందికి తిరుపతి పద్మావతి ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు, వారికి అయ్యే ఖర్చులను తామే భరిస్తామని తెలిపారు. గ్రామంలో ఇలాంటి వైద్య శిబిరాలను ప్రతి నెలా నిర్వహిస్తే ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బుక్కపట్నం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.40 లక్షల విలువైన వంట సామగ్రి పంపిణీ



కొత్తచెరువు : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తచెరువు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన వంట సామగ్రిని పంపిణీ చేశారు. మండలంలోని 45 అంగన్‌వాడీ సెంటర్లకు రూ.40 లక్షల వ్యయంతో మంజూరైన స్టవ్‌లు, కుక్కర్లు, వంట పాత్రలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. కేంద్రాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించడం ద్వారా పిల్లల ఆరోగ్యం, అభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# గన్నవరంలో ఘనంగా వైఎస్ఆర్ 77వ జయంతి వేడుకలు

**మహానేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్**

**కేకు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు..**

**2029లో జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలి: వంశీ పిలుపు..**



గన్నవరం, : :గన్నవరం నియోజకవర్గ కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యాలయ ప్రాంగణమంతా వైఎస్సార్ నామస్మరణతో మారుమోగింది.ఘన నివాళులు – కేక్ కటింగ్:కార్యక్రమంలో భాగంగా మొదటగా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్.. డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి చేతులు జోడించి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలను, ఆయన అందించిన సంక్షేమ పాలనను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తల సమక్షంలో జయంతి వేడుకల కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేకు ముక్కలు, మిఠాయిలను పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.వైఎస్సార్ ఆశయ సాధనే ధ్యేయం వల్లభనేని వంశీ:ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర రెడ్డి గారూ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్‌మెంట్ వంటి పథకాలు తెలుగు ప్రజల గుండెల్లో ఆయనను చిరస్థాయిగా నిలిపాయన్నారు. ప్రజా సేవ, సంక్షేమ పాలనే ధ్యేయంగా బ్రతికిన వైఎస్సార్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్యకర్త కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ ఆశయాల సాధన కోసం, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో మనమందరం సమిష్టిగా, మరింత పట్టుదలగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని శ్రేణులను కోరారు. రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంజీవరెడ్డి ని మళ్లీ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమే మన ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో కష్టపడాలని పిలుపునిచ్చారు. తరలివచ్చిన ముఖ్య నాయకులు:ఈ ఘనమైన జయంతి వేడుకల్లో రాష్ట్ర వైఎస్ఆర్సిపి ట్రేడ్ యూనియన్ నాయకులు అనగాని రవి, వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకులు వైనాయకులు తోట వెంకయ్య, మైనార్టీ విభాగం నాయకులు ఎండి గౌసాని, జెడ్పిటిసి సభ్యురాలు అన్నవరపు ఎలిజిబెత్ రాణి, కోడి బోయిన బాబి లతో పాటు నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

## మన ఆస్తి మన భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**బైరాపురంలో 820 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ**






కొత్తచెరువు: రైతుల భూములకు సంపూర్ణ రక్షణ కల్పించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. బుధవారం కొత్తచెరువు మండలం బైరాపురం గ్రామంలో 820 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల ఆస్తులకు భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పారదర్శకంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. గత ప్రభుత్వ విధానాల వల్ల ఏర్పడిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, భారీ పరిశ్రమలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు, ఆమడగూరులో రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్టు వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ప్రాంత అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. నియోజకవర్గంలో రూ.32 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కృష్ణా జలాలను తీసుకొచ్చి 193 చెరువులను నింపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పుట్టపర్తి మండలంలో ఘనంగా వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు



పుట్టపర్తి : మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను పుట్టపర్తి మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పెడపల్లి, బ్రాహ్మణపల్లి, వెంగళమ్మ చెరువు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేసిన మహానేతగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేశవరెడ్డి ఆధ్వర్యంలో, పెడపల్లి గ్రామంలో ఎంపీపీ రమణారెడ్డి, మాజీ సర్పంచ్ చిత్తరంజన్ రెడ్డి, తిరుపాల్ నాయక్, అంగిడి నాగభూషణం, రామచంద్ర నాయక్ ఆధ్వర్యంలో నివాళులర్పించి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో నిర్లక్ష్యం వద్దు - ప్రతి ఓటు కీలకం - మాజీ మంత్రి

**ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించాలని బీఎల్ఏలకు సూచన**



పుట్టపర్తి : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ బాధ్యతాయుతంగా పనిచేయాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సూచించారు. బుధవారం పుట్టపర్తి టీడీపీ కార్యాలయంలో పుట్టపర్తి అర్బన్ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రత్యేక సర్వేపై క్లస్టర్ ఇంచార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి వివరాలను నిబంధనల ప్రకారం గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఖచ్చితమైన సమాచారం నమోదు చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా సర్వే నిర్వహించి నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. పార్టీ నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పుట్టపర్తి అర్బన్ పార్టీ పరిశీలకులు మల్లిరెడ్డి, నాగరాజు, మంజునాథ్ రెడ్డి, పార్టీ నాయకులు శ్రీరాములు, ఉమాపతి, మాల మనోహర్, సుధాకర్, జయప్రకాష్, క్లస్టర్ ఇంచార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, టీడీపీ మహిళా నేతలు పద్మావతి, రమణమ్మ, చెన్నకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 248 మంది విద్యార్థులకు విద్యా, క్రీడా కిట్ల పంపిణీ

**విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం – ఎమ్మెల్యే, మాజీ మంత్రి**



పుట్టపర్తి :విద్యార్థుల భవిష్యత్తు బలోపేతమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. బుధవారం పుట్టపర్తిలోని ఎంజేపీ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి 248 మంది విద్యార్థులకు విద్యా కిట్లు, క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డొక్కా సీతమ్మ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు విద్యామిత్ర కార్యక్రమం ద్వారా విద్యా కిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి సమగ్ర వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సహకార సొసైటీ అధ్యక్షుడు విజయ్ కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## బహిరంగంగా మద్యం సేవించిన ఏడుగురికి రూ.7 వేల జరిమానా



పుట్టపర్తి : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగించిన ఏడుగురిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో వారిని అదుపులోకి తీసుకుని పుట్టపర్తి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణ సందర్భంగా నిందితులు తమ తప్పును అంగీకరించడంతో కోర్టు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున మొత్తం రూ.7,000 జరిమానా విధించినట్లు పుట్టపర్తి అర్బన్ సీఐ యువరాజు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరిస్తూ, ప్రజలు చట్టాలను గౌరవించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## లాడ్జిల్లో బస చేసే ప్రతి ఒక్కరి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి - సీఐ యువరాజు

పుట్టపర్తి (: లాడ్జిల్లో బస చేసే ప్రతి అతిథి వివరాలను ఆధార్ లేదా ఇతర గుర్తింపు పత్రాలతో తప్పనిసరిగా నమోదు చేసి భద్రపరచాలని పుట్టపర్తి అర్బన్ సీఐ యువరాజు లాడ్జి యజమానులకు సూచించారు. బుధవారం సాయిఆరాంలో నిర్వహించిన అవగాహన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పుట్టపర్తిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విదేశీ యులు లాడ్జిల్లో బస చేస్తే వారి వివరాలతో కూడిన ఫారం-సిను నిబంధనల ప్రకారం వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు పంపించాలని సూచించారు. అలాగే లాడ్జిల్లో వ్యభిచారం, పేకాట, మద్యం సేవించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా యజమానులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి లాడ్జిలో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా నిర్వహించడంతో పాటు, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ యువరాజు స్పష్టం చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పై అవగాహన సదస్సు



జైపూర్, : మంచిర్యాల జిల్లా జైపూర్ గ్రామ పంచాయతీ లో కళజాతి,తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ( ఎస్ఐఆర్ )కార్యక్రమపైన ,మహిళలపై జరిగే అకృత్యాల నివారణ మరియు యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు.తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం ద్వారా ప్రజలకు,ఓటర్లకు,విద్యార్థులకు చైతన్య సందేశాలను అందించారు.బిఎల్ఓ లు ఇంటింటికి అందజేసిన ఎస్ఐఆర్ ఫామ్ లను జాగ్రత్త పూరించి బిఎల్ వో లకు ఆ ఫామ్స్ అందించాలని తెలిపారు.మహిళల భద్రత,యువత బాధ్యతాయుతమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనజా రెడ్డి,ఎంపీవో శ్రీపతి బాపు రావు,జైపూర్ గ్రామ సర్పంచ్ కూన భాస్కర్,ఉప సర్పంచ్ ఇరిగిరాల శ్రావణ్ కుమార్,ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజ్య లక్ష్మి,పంచాయతీ కార్యదర్శి బి.ఉదయ్ కుమార్,అధ్యాపకులు,కార్యాలయ సిబ్బంది,మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు సురక్షిత పురుగుమందుల వినియోగం, విత్తన శుద్ధిపై అవగాహన కార్యక్రమం



రెబ్బనవాస్తవ : కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం (జన్యూవీజ), హైదరాబాద్ ఆధ్వర్యంలో రైతులకు పురుగుమందుల సురక్షిత వినియోగం, విత్తన శుద్ధి మరియు సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీ ఉదయ్ శంకర్ గారు రైతులకు పురుగుమందులను కొనుగోలు చేసే సమయంలో, పిచికారి చేసేటప్పుడు మరియు వినియోగం అనంతరం పాటించాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీ బసవన్నప్ప గారు విత్తన శుద్ధి విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన (డెమో) నిర్వహించి, విత్తన శుద్ధి వల్ల విత్తన మరియు నేల ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించవచ్చని రైతులకు వివరించారు. స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి శంకర్ గారు పాల్గొని రైతులు విత్తన శుద్ధి తప్పకుండా చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని, సురక్షిత పురుగుమందుల వినియోగం, విత్తన శుద్ధి మరియు సమగ్ర శస్యరక్షణ పద్ధతులపై విలువైన సమాచారాన్ని పొందారు

## గోలేటి గ్రామంలో నార్కోటిక్స్ డాగ్ తో తనిఖీ




రెబ్బన : జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు బుధవారం రెబ్బెన మండలం గోలేటి గ్రామంలో పోలీసులు నార్కోటిక్స్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని పలు వ్యాపార సముదాయాలు, దుకాణాలతో పాటు అనుమానాస్పదంగా ఉన్న పలు నిర్మానుష్య ప్రాంతాలలో గాంజా, ఇతర మత్తు పదార్థాల ఆనవాళ్ల కోసం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెబ్బెన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ఎ. వెంకటకృష్ణ మాట్లాడుతూ.. సమాజానికి శాపంగా మారిన మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎలాంటి మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 1908 నెంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. 1908 టోల్-ఫ్రీ నంబర్ అనేది డ్రగ్స్ నియంత్రణ, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు మరియు డ్రగ్స్ బానిసత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేయబడిన అత్యవసర హెల్ప్‌లైన్ అని తెలంగాణలో దీనిని తెలంగాణ ఈగల్ ఫోర్స్ మరియు రాష్ట్ర నార్కోటిక్స్ బ్యూరో నిర్వహిస్తున్నాయి అని తెలిపారు ముఖ్యంగా గాంజా విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేసిన వారికి తగిన బహుమతి అందజేస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచుతామని ఎస్ఐ స్పష్టం చేశారు.

# సింగిల్ ఛార్జింగ్‌పై 656 కి.మీ మైలేజ్ మతిపోగొట్టే టాప్ 3 ఎలక్ట్రిక్ కార్లు..!



పెరుగుతున్న డీజిల్ ధరలు, ఆధునిక సాంకేతికత ప్రజల ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ రోజుల్లో రూ. 25 నుంచి 45 లక్షల బడ్జెట్‌తో ప్రజలు సాంప్రదాయ డీజిల్ ఎస్‌యూవీల నుంచి శక్తివంతమైన ఎలక్ట్రిక్ వాహనాలకు మారుతున్నారు. ఇవి డబ్బు ఆదా చేయడమే.. ఫార్చ్యూనర్, స్కార్పియో చాలా కాలంగా భారతీయ రహదారులపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వాటి శక్తివంతమైన డీజిల్ ఇంజన్లు, అద్భుతమైన, క్లాసీ రూపానికి ప్రజలు ఈ కార్ల పట్ల పిచ్చిగా ఉండేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు. పెరుగుతున్న డీజిల్ ధరలు, ఆధునిక సాంకేతికత ప్రజల ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ రోజుల్లో రూ. 25 నుంచి 45 లక్షల బడ్జెట్‌తో ప్రజలు సాంప్రదాయ డీజిల్ ఎస్‌యూవీల నుంచి శక్తివంతమైన ఎలక్ట్రిక్ వాహనాలకు మారుతున్నారు. ఇవి డబ్బు ఆదా చేయడమే కాకుండా, రోడ్లపై ఉన్న పెద్ద వాహనాలకు గట్టి పోటీని కూడా ఇస్తున్నాయి. మార్కెట్లో ఏ ఎస్‌యూవీలు ప్రజాదరణ పొందుతున్నాయో ఇప్పుడు చూద్దాం.

**మహీంద్రా XEV 9ఎ:**

మహీంద్రా ఆటోమొబైల్స్ ఇప్పుడు ఎలక్ట్రిక్ కార్లపై ఎక్కువగా దృష్టి సారిస్తోంది. మహీంద్రా సుమారు రూ. 22 నుంచి 31 లక్షల బడ్జెట్‌లో ఒక అద్భుతమైన ఎలక్ట్రిక్ కారును విడుదల చేసింది. మహీంద్రా ఎక్స్‌ఈవీ 9ఎ అనేది రోడ్డుపై వెళ్తున్నప్పుడు తన రూపంతో అందరి దృష్టిని ఆకర్షించే కారు. దీని ట్రిపుల్-స్క్రీన్, క్యాబిన్‌లోని భవిష్యత్ ఫీచర్లు దీనిని ఒక విలాసవంతమైన అంతరిక్ష నౌకలా కనిపించేలా చేస్తాయి. అన్నింటికన్నా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే దీని పెద్ద బ్యాటరీ ప్యాక్ ఒకే ఛార్జ్‌పై సుమారు 656 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంటుందని చెబుతున్నారు. సుదూర ప్రయాణాలకు ఇది ఒక సరైన ఎలక్ట్రిక్ కారు.

**టాటా హారియర్ ఈవీ :**

టాటా మోటార్స్ తన అత్యంత శక్తివంతమైన, సురక్షితమైన ఎస్‌యూవీ అయిన హారియర్‌ను ఎలక్ట్రిక్ రూపంలో విడుదల చేసింది. రూ. 21.49 లక్షల ప్రారంభ ధరతో లభించే ఈ కారు, ఫార్చ్యూనర్ వంటి పెద్ద వాహనం శక్తిని, అత్యుత్తమ ప్రయాణ సౌకర్యాన్ని కోరుకునే వారికి ఒక గొప్ప ఎంపిక. హారియర్ ఎస్‌యూవీలో ఆల్-వీల్ డ్రైవ్ ఆప్షన్ కూడా ఉంది. దీని అర్థం మీరు ఎలాంటి సంకోచం లేకుండా దీనిని చెడ్డ రోడ్లపై లేదా ఆఫ్-రోడింగ్‌లో నడపవచ్చు. దీని క్యాబిన్ చాలా ప్రీమియంగా ఉంటుంది. నిశ్శబ్దంగా నడుస్తుంది. ఇది ఒకసారి ఛార్జింగ్ చేస్తే 538 నుంచి 627 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇస్తుందని కంపెనీ చెబుతోంది.

**BYD ఒక అద్భుతమైన ఎలక్ట్రిక్ SUV**

మీకు పూర్తిగా భిన్నమైన, గాడ్జెట్‌లతో నిండిన కారు కావాలంటే బీవైడీ అట్టో 3 ఉత్తమ ఎంపిక. దీని ధర సుమారు రూ. 25 నుండి 34 లక్షల మధ్య ఉంటుంది. ఈ ఎస్‌యూవీ ఇంటీరియర్ చాలా ప్రత్యేకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. దీని రొటేటింగ్ టచ్‌స్క్రీన్, అధునాతన డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ డ్రైవింగ్‌ను మరింత సురక్షితంగా, సులభంగా చేస్తాయి. సుమారు 521 కిలోమీటర్ల రేంజ్, సున్నితమైన పవర్ డెలివరీతో ఈ కారు ఇప్పుడు పెద్ద నగరాల్లో మొదటి ఎంపికగా మారుతోంది.

# ఉద్యోగం చేసేవాళ్లే కాదు ఈ 9 మంది కూడా ఆదాయపు పన్ను చెల్లించాల్సిందే




బ్యాంకులు అందించిన మీ కరెంట్ ఖాతాలో కోటి రూపాయలకు పైగా ఉంటే, మీరు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది. వ్యక్తి ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ, అటువంటి పరిస్థితిలో వారు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది.. భారతదేశంలో ఒక నిర్దిష్ట మొత్తం కంటే ఎక్కువ వార్షిక ఆదాయం సంపాదించే వ్యక్తులు ఆదాయపు పన్ను చెల్లించడం తప్పనిసరి. కేవలం ఉద్యోగాలు చేసేవారు, స్వయం ఉపాధి పొందుతున్నవారు మాత్రమే ఆదాయపు పన్ను చెల్లించాలని చాలా మంది అనుకుంటారు. కానీ, అది నిజం కాదు. ఉద్యోగాలు చేసేవారే కాకుండా ఈ 9 మంది కూడా ఆదాయపు పన్ను చెల్లించాలి. ఈ పరిస్థితిలో దీని గురించి ఆదాయపు పన్ను నియమాలు ఏమి చెబుతున్నాయో తెలుసుకుందాం.

**విదేశీ ఆస్తులు:**

మీరు భారత పౌరులై ఉండి, విదేశాలలో ఏదైనా ఆస్తిని కలిగి ఉండి, ఆ విదేశీ ఆస్తి నుండి ప్రయోజనం పొందుతూ, విదేశీ బ్యాంకు ఖాతాపై సంతకం చేసే అధికారం కలిగి ఉన్నట్లయితే మీరు ఆదాయపు పన్ను దాఖలు చేయవలసి ఉంటుంది.

**అధిక విదేశీ ప్రయాణ ఖర్చులు:**

ఒక ఆర్థిక సంవత్సరంలో మీరు మీ కోసం గానీ లేదా ఇతరుల కోసం గానీ విదేశీ ప్రయాణాలకు రూ. 2 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేసినట్లయితే మీరు ఆదాయపు పన్ను చెల్లించవలసి ఉంటుంది.

**అధిక టీడీఎస్ తగ్గింపు:**

మీ పేరు మీద మినహాయించిన టీడీఎస్, టీసీఎస్ ఒక నిర్దిష్ట మొత్తాన్ని మించి ఉంటే ఆ వ్యక్తి ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది.

సాధారణ వ్యక్తి: రూ.25,000

వయోవృద్ధులు: రూ.50,000

**పొదుపు ఖాతాలో అధిక నిల్వ**

ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పొదుపు ఖాతాలలో రూ. 50 లక్షలకు పైగా ఉన్న వ్యక్తి ఆదాయపు పన్ను దాఖలు చేయవలసి ఉంటుంది.

**కరెంట్ ఖాతాలో అధిక డిపాజిట్**

బ్యాంకులు అందించిన మీ కరెంట్ ఖాతాలో కోటి రూపాయలకు పైగా ఉంటే, మీరు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది. వ్యక్తి ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ, అటువంటి పరిస్థితిలో వారు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది.

**వ్యాపార ఆదాయం**

మీరు వ్యాపార యజమాని అయి ఉండి, మీ వార్షిక ఆదాయం రూ. 60 లక్షల కంటే ఎక్కువగా ఉంటే మీరు ఆదాయపు పన్ను దాఖలు చేయవలసి ఉంటుంది.

**వృత్తిపరమైన ఆదాయం**

మీరు వైద్యులు, న్యాయవాదులు, సాంకేతిక సలహాదారులు, ఫ్రీలాన్సర్లు మొదలైన వృత్తి నిపుణులైతే, మీ వార్షిక ఆదాయం రూ. 10 లక్షల కంటే ఎక్కువగా ఉన్నప్పుడు మీరు ఆదాయపు పన్ను దాఖలు చేయడం తప్పనిసరి.

**అధిక విద్యుత్ బిల్లు**

ఒక వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ బిల్లుల కింద రూ.1 లక్ష కంటే ఎక్కువ చెల్లిస్తే, ఆ వ్యక్తి ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

**ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితిని మించి:**

80జ, 80ఄ మొదలైన పెట్టుబడి మినహాయింపులను తీసివేయక ముందు ప్రభుత్వం నిర్దేశించిన ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితిని ఒక వ్యక్తి మొత్తం ఆదాయం మించి ఉంటే వారు ఆదాయపు పన్ను రిటర్న్‌ను దాఖలు చేయవలసి ఉంటుంది. పై వర్గాల పరిధిలోకి వచ్చే వ్యక్తులు ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడం తప్పనిసరి అని గమనించడం ముఖ్యం.

# హస్తినాపురంలో అక్రమ షెడ్లపై అధికారుల మౌనం ఎందుకు..?

**రెండుసార్లు నోటీసులు... అయినా ఆగని నిర్మాణాలు**

**హైటెన్షన్ లైన్ల కింద భారీ షెడ్డు నిర్మాణంపై ఆందోళన**

**కార్పొరేషన్ ఆదాయానికి గండి...**

**నిబంధనలు అమలు చేయడంలో వైఫల్యమా..?**

**ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విచారణ చేపట్టాలంటున్న స్థానికులు**



ఎల్‌బీనగర్ జోన్ ప్రతినిధి/ **(దిక్సూచి ప్రతినిధి):** ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం డివిజన్‌లో జరుగుతున్న అక్రమ షెడ్డు నిర్మాణాలు అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, నిర్మాణ పనులు ఏమాత్రం ఆగకుండా కొనసాగుతుండడం స్థానికుల్లో అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా నోటీసులు జారీ చేసిన తర్వాత నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను నిలిపివేయడం, అవసరమైతే సీజ్ చేయడం లేదా కూల్చివేయడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం నోటీసులు జారీ కావడం తప్ప, క్షేత్రస్థాయిలో ఎలాంటి కఠిన చర్యలు కనిపించకపోవడంతో అధికారుల వైఖరిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద భారీ షెడ్డు నిర్మాణం కొనసాగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. విద్యుత్ భద్రతా ప్రమాణాలను పక్కనపెట్టి ఇలాంటి నిర్మాణాలకు ఎలా అవకాశం కల్పించారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రమాదం సంభవిస్తే దానికి బాధ్యత ఎవరు వహిస్తారన్న సందేహాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు కొనసాగితే కార్పొరేషన్‌కు రావాల్సిన బిల్డింగ్ అనుమతి ఫీజులు, అభివృద్ధి ఛార్జీలు, ఇతర ఆదాయాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలు పాటించే వారిపై ఒక విధానం, అక్రమ నిర్మాణాలు చేపట్టేవారిపై మరో విధానం అమలవుతోందా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు కథనాలు వెలువడినా, నిర్మాణాలు మాత్రం యథావిధిగా కొనసాగుతుండటం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా పనులు ఎందుకు ఆగలేదో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి అర్చన స్పందన కోసం పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన లభించలేదు. ఈ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే తక్షణ చర్యలు తీసుకుంటారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# ది నానో'పై వరుస కథనాల ప్రభావం..!

**ఎట్టకేలకు స్పందించిన ఇంటర్మీడియట్ శాఖ..!**

**'ది నానో' జూనియర్ కాలేజీకి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం**

**అనుమతులు, గుర్తింపు, ఫైర్ సేఫ్టీ వివరాలు సమర్పించాలని ఆదేశించినట్లు ప్రచారం**

**ఇక సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటారా..?**




రంగారెడ్డి / బడంగ్‌పేట్, ప్రతినిధి **(దిక్సూచి ప్రతినిధి):** బడంగ్‌పేట్ మున్సిపల్ పరిధిలోని 'ది నానో' జూనియర్ కాలేజీ నిర్వహణపై గత కొద్ది రోజులుగా వెలువడుతున్న కథనాలు, స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ స్పందించినట్లు సమాచారం. మంగళవారం కళాశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి, వివిధ అనుమతులు, గుర్తింపు పత్రాలు, భద్రతా ప్రమాణాలకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై అధికారుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

**కదిలిన ఇంటర్మీడియట్ శాఖ..!**



కాలేజీ నిర్వహణలో ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు, మున్సిపల్ అనుమతులు, ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్, భవన భద్రత, విద్యార్థుల రక్షణ వంటి అంశాలపై వరుసగా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాలపై వరుస కథనాలు వెలువడినా చర్యలు కనిపించకపోవడంపై తల్లిదండ్రులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**ఏ వివరాలు కోరారు..?**

కళాశాల నిర్వహణకు సంబంధించిన అన్ని అనుమతి పత్రాలు, ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు, విద్యార్థుల అడ్మిషన్ వివరాలు, ఫైర్ సేఫ్టీ అనుమతులు, భవన స్థిరత్వ ధ్రువీకరణ పత్రాలు తదితర రికార్డులను సమర్పించాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం. దీనిపై కళాశాల యాజమాన్యం ఎలాంటి వివరణ ఇస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

**క్షేత్రస్థాయి తనిఖీలు ఉంటాయా..?**

నోటీసులు జారీ చేయడమే కాకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఇంటర్మీడియట్ శాఖతో పాటు మున్సిపల్ అధికారులు, ఫైర్ సర్వీసెస్, సంబంధిత శాఖలు సంయుక్తంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలే..!**

విచారణలో ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి వస్తే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. మరోవైపు, అన్ని అనుమతులు సక్రమంగా ఉన్నట్లయితే ఆ విషయాన్ని కూడా అధికారికంగా ప్రజలకు వెల్లడించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఇప్పుడు అందరి దృష్టి తదుపరి చర్యలపైనే..!**

నోటీసులు జారీ చేసినట్లు సమాచారం రావడంతో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది. పూర్తి స్థాయి విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తారా? లేక వ్యవహారం నోటీసులకే పరిమితమవుతుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది. అధికారిక విచారణ నివేదిక వెలువడిన తర్వాతే ఆరోపణలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.


ది నానో' పేరుతో విద్యా మాఫియా..?

# డిఫెన్స్ స్టాక్ దుమ్మురేపింది రూ.1 లక్ష పెట్టుబడి రూ.24 లక్షలైంది..!

కంపెనీ బ్యాలెన్స్ షీట్, త్రైమాసిక ఫలితాలు కూడా దాని విజయానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. 2026 మార్చి 31 నాటికి, కంపెనీ వద్ద రూ.103.4 కోట్ల విలువైన ఖచ్చితమైన ఆర్డర్లు ఉండగా, రూ.221 కోట్ల విలువైన టెండర్లు పరిశీలనలో ఉన్నాయి. ఆర్థిక పరంగా చూస్తే ఖీ2026 నాల్గవ.. మీరు స్టాక్ మార్కెట్‌లో సరైన కంపెనీలో ఓపికగా పెట్టుబడి పెడితే, గణనీయమైన లాభాలను ఆర్జించడం అసాధ్యం కాదు. ఇటీవలి సంవత్సరాలలో, భారతీయ స్టాక్ మార్కెట్‌లో రక్షణ రంగ కంపెనీలు పెట్టుబడిదారులకు అద్భుతమైన రాబడులను అందించాయి. అటువంటి ప్రకాశవంతమైన పేర్లలో ఒకటి కృష్ణ డిఫెన్స్ అండ్ అలైడ్ ఇండస్ట్రీస్. ఇది తన పెట్టుబడిదారులకు గణనీయమైన లాభాలను ఆర్జించింది. కేవలం గత కొన్ని సంవత్సరాలలోనే ఈ కంపెనీ స్టాక్ ధర కేవలం రూ.56 నుండి రూ.1,342 కి ఎగబాకింది. ఒకవేళ ఎవరైనా ఈ స్టాక్‌లో రూ.1,00,000 పెట్టుబడి పెట్టి ఉంటే వారి పెట్టుబడి ఈ రోజు దాదాపు రూ.2.4 మిలియన్లకు చేరి ఉండేది. బలమైన లాభాలు, పటిష్టమైన ఆర్డర్ల జాబితా, ప్రతిష్టాత్మక భవిష్యత్ ప్రణాళికలు ఈ కంపెనీని మార్కెట్ దృష్టిలో నిలబెట్టాయి.

**ఒక లక్ష రూపాయల పెట్టుబడి రెండున్నర లక్షల రూపాయలైంది:**

స్టాక్ మార్కెట్ డేటాను పరిశీలిస్తే.. ఈ స్టాక్ వృద్ధి అద్భుతంగా ఉంది. జూలై 15, 2022న ఈ స్టాక్ ధర కేవలం రూ.56గా ఉండేది. జూన్ 25, 2026 నాటికి ఈ స్టాక్ ఏకంగా రూ.1341.70కి చేరుకుంది. ఈ స్వల్ప కాలంలోనే ఈ స్టాక్ సుమారుగా 2296.43% భారీ రాబడిని అందించింది. అంటే సరైన సమయంలో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టిన ఒక పెట్టుబడిదారుడు ఇప్పుడు రూ.23.96 లక్షల వరకు లాభపడ్డాడు. దీర్ఘకాలంలోనే కాకుండా గత సంవత్సర కాలంలో కూడా ఈ స్టాక్ సుమారుగా 43% ఆకట్టుకునే రాబడులను అందిస్తూ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంది.

**అసలు ఈ కంపెనీ ఏం చేస్తుంది?**

ఏదైనా కంపెనీలో పెట్టుబడి పెట్టే ముందు దాని వ్యాపార నమూనాని అర్థం చేసుకోవడం ముఖ్యం. కృష్ణ డిఫెన్స్ ప్రధానంగా



భారత సైన్యం, నౌకాదళం కోసం కీలకమైన రక్షణ పరికరాలు, వ్యవస్థలను తయారు చేస్తుంది. దీని ఉత్పత్తి శ్రేణిలో రక్షణ, ఏరోస్పేస్ ఉత్పత్తులతో పాటు, నౌకాదళ వ్యవస్థలు, సాయుధ వాహన విడిభాగాలు, నౌకా నిర్మాణ భాగాలు కూడా ఉన్నాయి. ఈ కంపెనీ పాడి పరికరాలను కూడా తయారు చేస్తుంది. దీని తయారీ యూనిట్లు గుజరాత్‌లోని హలోల్, కలోల్‌లో ఉండగా, పరిశోధన, అభివృద్ధి (=ఆఈ) కార్యకలాపాలన్నీ బెంగళూరులోని దీని కేంద్రం నుండి నిర్వహణ కొనసాగుతున్నాయి. కంపెనీ బ్యాలెన్స్ షీట్, త్రైమాసిక ఫలితాలు కూడా దాని విజయానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. 2026 మార్చి 31 నాటికి, కంపెనీ వద్ద రూ.103.4 కోట్ల విలువైన ఖచ్చితమైన ఆర్డర్లు ఉండగా, రూ.221 కోట్ల విలువైన టెండర్లు పరిశీలనలో ఉన్నాయి. ఆర్థిక పరంగా చూస్తే ఖీ2026 నాల్గవ త్రైమాసికంలో కంపెనీ ఆదాయం గత ఏడాది రూ.46 కోట్ల నుండి రూ.65 కోట్లకు పెరిగింది. నికర లాభం కూడా రూ.7 కోట్ల నుండి రూ.14 కోట్లకు రెట్టింపు అయింది. కంపెనీకి దాదాపు సున్నా అప్పు (డెట్-టు-ఈక్విటీ నిష్పత్తి 0.01) ఉండటంతో ఇది ఒక సురక్షితమైన పెట్టుబడిగా నిలుస్తుంది. రాబోయే మూడు నుండి ఐదు సంవత్సరాలలో 30% కంటే ఎక్కువ జూ+=ను సాధించాలని కంపెనీ ఇప్పుడు లక్ష్యంగా పెట్టుకుంది.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815